ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
సోమవారం 22 జూలై 2024





రాయపేట వద్ద మెట్రోరైలు మార్గం పనులు పరిశీలిస్తున్న మంత్రి ఉదయనిధి

రెండో విడత త్వరితగతిన పూర్తిచేయాలి

● రాయపేటలో మెట్రోరైల్ పనులు పరిశీలించిన మంత్రి ఉదయనిధి



సొరంగం తవ్వక పనులు పరిశీలిస్తున్న మంత్రి

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలో రెండో దశ మెట్రో రైలు మార్గం పనులను, సొరంగం పనులను రాష్ట్ర యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి ఆదివారం ఉదయం పరిశీలించారు. రాయపేటలోని రాధాకృష్ణన్ రోడ్డు దిగువ సొరంగం తవ్వే పనులను కార్మికులు, ఇంజనీరింగ్ నిపుణులతో కలిసి పరిశీలించారు. 910 మీటర్ల పొడవున టన్నెల్ యంత్రంతో సొరంగం తవ్వే పనులను ఆసక్తిగా గమనించారు. ఆ సందర్భంగా మెట్రోరైలు సంస్థ అధికారులు పథకానికి సంబంధించిన పురోగతిని ఆయనకు వివరించారు. ఉదయనిధితోపాటు మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎంపీ దయానిధి మారన్, చెన్నై వెస్ట్ డీఎంకే జిల్లా కార్యదర్శి సిట్రరసు, చేపాక్ మదన్‌మోహన్, అధికారులు పాల్గొన్నారు.

మాగుంట, వేమిరెడ్డిలకు ఆత్మీయ సత్కారం

మాజీ ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా సన్మానం ● హాజరైన తెలుగు ప్రముఖులు



మాగుంట, వేమిరెడ్డిలను సత్కరించిన వెంకయ్య నాయుడు, నరసారెడ్డి తదితరులు

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒంగోలు నుంచి ఎన్నికైన మాగుంట శ్రీనివాస్‌రెడ్డి, నెల్లూరు నుంచి ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఆత్మీయ సత్కారం జరిగింది. కెన్సెస్ గ్రూపు సంస్థల అధినేత కె.నరసారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మహాబలిపురం సమీపంలో వున్న వెల్‌కం హోటల్లో ఈ సత్కారం జరిగింది. భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రత్యేక అతిథిగా హాజరై ఇద్దరు ఎంపీలను సన్మానించి, ఆశీర్వదించారు. కార్యక్రమానికి హాజరైన అతిథులను ఆహ్వానించిన నరసారెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభకు ఎన్నికైన తన చిన్ననాటి స్నేహితులు మాగుంట, వేమిరెడ్డిని ఇలా సత్కరించుకోవడం సంతోషంగా వుందన్నారు. వారు ప్రజలకు సేవ చేస్తూ రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆకాంక్షించారు. రాజకీయాల్లో సీనియర్, భారత మాజీ ఉపరాష్ట్రపతి వచ్చి వారిని ఆశీర్వదించడం సంతోషంగా వుందన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. తమ నెల్లూరు వాసులు ఇద్దరు లోక్‌సభకు ఎన్నికైన శుభసందర్భంగా నరసారెడ్డి చొరవ తీసుకుని చెన్నైలో వున్న ఆత్మీయులతో కలిసి సత్కరించడం సంతోషంగా వుందన్నారు. గతంలో ఒక్క నెల్లూరు నుంచే 9 మంది ఎంపీలుండేవారని గుర్తు చేసుకున్నారు. నెల్లూరువారికుండే కలుపుగోలుతనంతో రాజకీయాల్లో చక్కగా రాణిస్తున్నారన్నారు. మాగుంట కుటుంబం చాలాకాలంగా ఒంగోలు ప్రజలకు సేవలందిస్తోందని, మాగుంట శ్రీనివాస్‌రెడ్డి కూడా దానిని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. ఇటీవల మాగుంట సరైన సమయంలో మంచి నిర్ణయం తీసుకుని మళ్లీ ఎంపీగా ఎన్నికయ్యారని అభినందించారు. అందరితో స్నేహంగా వుంటూ, అందరినీ కలుపుకుపోతూ అజాతశత్రువుగా పేరొందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికవడం సంతోషదాయకమన్నారు. ఆయన తాను సంపాదించిన దానిలో కొంత ప్రజలకు పంచి పెడుతూ, సేవ చేస్తున్నారని అభినందించారు. అలాంటి వ్యక్తి లోక్‌సభ సభ్యుడిగా, ఆయన సతీమణి శాసనసభ్యురాలిగా.. దంపతులిద్దరూ చట్టసభలకు ఎన్నికవడం ఆనందకరమైన విషయమంటూ వారిని వెంకయ్య ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి కెన్సెస్ గ్రూపు సంస్థల సీఈవో ఎం.కృష్ణ, పారిశ్రామికవేత్త సిద్ధార్థరెడ్డి, 'ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్' (ఆస్కా) అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారెడ్డి, అన్నాడీఎంకే యువజన విభాగ సంయుక్త కార్యదర్శి డాక్టర్ కె.సునీల్, మాజీ ఎంపీ కందుల రాజమోహన్‌రెడ్డి, మాజీ డీజీపీ శేఖర్, టీటీడీ చెన్నై సమాచార కేంద్ర సలహామండలి మాజీ అధ్యక్షులు ఆనందకుమార్‌రెడ్డి, ఎన్.శ్రీకృష్ణ, మాజీ సభ్యులు మోహన్‌రావు, రంగారెడ్డి, అపోలో హాస్పిటల్స్ ప్రెసిడెంట్ డాక్టర్ నరోత్తమ్ రెడ్డి, అపోలో సీఈవో సత్యనారాయణ రెడ్డి, టీడీపీ నేతలు బ్రహ్మానందం, రామాంజనేయులు, చలపతిరావు, రవిబాబు, రామారావు, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి, ద్రావిడదేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు, ప్రముఖ సంగీత దర్శకుడు వాసూరావు, బీజేపీ నేతలు ఎం.చక్రవర్తి, అమరప్రసాద్ రెడ్డి, పారిశ్రామికవేత్తలు ఎం.ఆదిశేషయ్య, ఎం.శ్రీనివాస్, హేమంత్‌కుమార్, ఎరుకలయ్య, రామచంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, నాగిరెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, రామిరెడ్డి, హేమంత్‌రెడ్డి, వంజివాక్కం బాలాజీ, అలయన్స్ సురేష్ రెడ్డి, వేమిరెడ్డి కోటారెడ్డి, సురేంద్రరాజు, రవి సన్నారెడ్డి, సినీ నిర్మాతలు కాట్రగడ్డ ప్రసాద్, తిరుపతిరెడ్డి, ప్రముఖ నటుడు దగ్గుబాటు రాజా, కళాసుధ అధ్యక్షుడు శ్రీనివాస్, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎల్.సుధాకర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.





మాగుంట శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న సుబ్బారెడ్డి, అన్నాడీఎంకే నేతలు - వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న రవిబాబు, శ్రీకృష్ణ, సీఎంకే రెడ్డి తదితరులు



మదురైలో శివాజీ గణేశన్ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులతో నివాళులర్పిస్తున్న తిరునావుక్కరసర్

డీఎంకే మంత్రివర్గంలో కాంగ్రెస్‌కు స్థానం తప్పుకాదు

● మాజీ ఎంపీ తిరునావుక్కరసర్

ప్యారీస్, జూలై 21: రాష్ట్ర మంత్రి వర్గంలో కాంగ్రెస్ పార్టీకి స్థానం కల్పించమని కోరడం తప్పు కాదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) మాజీ అధ్యక్షుడు ఎస్.తిరునావుక్కరసర్ పేర్కొన్నారు. నడిగర్ తిలగం శివాజీ గణేశన్ 23వ వర్ధంతి సందర్భంగా మదురై జిల్లా కోర్టు సమీపంలో ఉన్న శివాజీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ తరపున ఆదివారం తిరునావుక్కరసర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ గణేశన్ సినిమాల్లో నటించని పాత్ర అంటూ ఏదీ లేదని, ఆ మహానటుడు అన్ని పాత్రల్లో జీవించి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. డీఎంకే మంత్రి వర్గంలో కాంగ్రెస్‌కు భాగస్వామ్యం కల్పించాలని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై కోరడంలో తప్పులేదని, దీనిపై ముఖ్యమంత్రి స్టాలిన్ పరిశీలించాలని కోరారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కాంగ్రెస్ కూటమి కొనసాగుతుందని, ఆ ఎన్నికల గెలిచిన తర్వాత మంత్రి వర్గంలో తప్పకుండా కాంగ్రెస్ స్థానం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో మెజార్టీ లేకుండా డీఎంకే ప్రభుత్వం ఏర్పాటుచేసిన సమయంలో కూడా కాంగ్రెస్ బయట నుంచి మద్దతు తెలిపిందని, 1967 తర్వాత అధికారానికి నోచుకోని కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని యువజన నేతలు చేసిన కృషి తప్పకుండా ఫలిస్తుందని తిరునావుక్కరసర్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఇండియా కూటమి ఆవిర్భావ సమయంలో కూటమి తరపు అభ్యర్థి రాహుల్‌గాంధీ అని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారని, అలాంటప్పుడు కాంగ్రెస్ అన్నాడీఎంకేతో ఎలా పొత్తుపెట్టుకుంటుందని ఆయన ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీలపై పెంపును పునఃసమీక్షించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తల్లాకుళం మురుగన్, మలర్ మాండియన్, దురైయరసన్, పరక్కుమ్‌పడై బాలు, శరవణాస్ బేగం తదితరులు పాల్గొన్నారు.

నిర్మలమ్మ కరుణించేనా ?

బడ్జెట్‌లో ఈసారైనా మా కోర్కెలను ఆమోదించండి ● సీఎం స్టాలిన్ డిమాండ్



చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు అమలుకు సరిపడేంత నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. మూడేళ్లుగా తాము పదే పదే విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోని రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో తప్పకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. అదే విధంగా తాంబరం - చెంగల్పట్టు మధ్య ఫ్లైఓవర్ నిర్మాణానికి బడ్జెట్‌లో ఆమోదం తెలపాలని, పదేళ్లుగా రాష్ట్రానికి చెందిన మధ్యతరగతి ప్రజానీకం ఎదురు చూస్తున్న ఆదాయపన్నుల భారాన్ని బాగా తగ్గించాలని, కోయంబత్తూరు, మదురై నగరాల్లో మెట్రోరైలు ప్రాజెక్టుల అమలుకు ఆమోదం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇదివరకే ప్రకటించిన రైల్వే పథకాలు, ఇటీవల ప్రకటించిన కొత్త రైల్వే ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యేలా నిధులు విడుదల చేయాలని స్టాలిన్ కోరారు. గ్రామీణ, నగర శివార్లలో గృహనిర్మాణ పథకం కింద నిర్మించే ఇళ్లకు అయ్యే ఖర్చు స్థాయి పెంచాలని, పదేళ్లుగా పెండింగ్‌లో ఉంచిన కీలకమైన పథకాలకు త్వరితగతిన నిధులు విడుదల చేసి తమిళ ప్రజల చిరకాల కోరికలు ఈ బడ్జెట్ నెరవేర్చుతాయని తాను ఆశిస్తున్నట్లు స్టాలిన్ తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికలకు సమన్వయ కమిటీ...

ఇదిలా ఉండగా 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకోసం సమన్వయకమిటీని ఏర్పాటు చేస్తూ డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. మంత్రులు కేఎన్ నెహ్రూ, తంగం తెన్నరసు, ఈవీ వేలు ఉదయనిధి, డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి సభ్యులుగా ఉంటారని ఆయన తెలిపారు. ఈ కమిటీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయానికి అవసరమైన చర్యలు చేపడుతుందని, అదే సమయంలో పార్టీ అభివృద్ధికి సలహాలను కూడా అందించాల్సి ఉంటుందన్నారు.

ఖర్గేకు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, జూలై 21: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం 82వ జన్మదినం జరుపుకుంటున్నారు. ఆయనకు పలు పార్టీల నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో, ఖర్గేకు ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో... కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు. మీ అనుభవం, సమర్థ నాయకత్వం కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు దోహదపడ్డాయి. సామాజిక న్యాయం పట్ల మీ నిబద్ధత, అణగారిన వర్గాల అభ్యున్నతికి చేస్తున్న ప్రయత్నాలు మా అందరికీ స్ఫూర్తినిస్తాయి. మీ ముందుకు సాగే ప్రయాణం విజయవంతంగా సాగుతుంది అంటూ సీఎం స్టాలిన్ పోస్ట్ చేశారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు....

డీఎండీకే నాయకుడి విచారణ

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో డీఎండీకే కార్యదర్శి సహా ఐదుగురిని ప్రత్యేక దళం పోలీసులు తీవ్ర విచారణ జరుపుతున్నారు. ఈ విచారణలో ఈ హత్యకేసుతో మరికొన్ని పార్టీ నేతలకు సంబంధాలున్నాయని వెల్లడికావటంతో పోలీసులు దిగ్భ్రాంతి చెందుతున్నారు. ఇప్పటికే ఈ కేసులో అన్నాడీఎంకేకు చెందిన మలర్‌కొడి, హరిహరన్, డీఎంకేకు చెందిన అరుళ్, టీఎంసీకి చెందిన హరిహరన్, బీజేపీకి చెందిన అంజలై అరెస్టయ్యారు. వీరంతా ఆమ్‌స్ట్రాంగ్ హంతకులకు ఏదోరకంగా సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి డీఎండీకే తిరువళ్లూరు నగర శాఖ కార్యదర్శి మణికంఠన్‌ను విచారణ ప్రారంభించారు. అరెస్టయిన హరిహరన్‌కు ఈ నేతతో సన్నిహిత సంబంధాలున్నాయని విచారణలో వెల్లడైంది. డీఎండీకే నేతతో పాటు జల్లిమేడు ప్రాంతానికి చెందిన ఓ నాయకుడు సహా నలుగురిని కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో ఇప్పటికే అరెస్టయిన 16 మందితోపాటు తాజాగా మరో ఐదుగురు కూడా అరెస్టయ్యారు. దీంతో అరెస్టయినవారి సంఖ్య 21కి పెరిగింది. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు నాలుగు రౌడీ ముఠాలు కలసి పథకం రూపొందించి అమలు చేసినట్లు పోలీసుల తాజా విచారణలో వెల్లడైంది.



కూవం నదిలో సెల్‌ఫోన్ కోసం గాలిస్తున్న పోలీసులు

కూవంలో సెల్‌ఫోన్ల కోసం గాలింపు...

ఇదిలా ఉండగా శనివారం సాయంత్రం అరెస్టయిన కడంబత్తూరు అన్నాడీఎంకే కౌన్సిలర్ హరిహరన్ అందించిన సమాచారం మేరకు ఆమ్‌స్ట్రాంగ్ హంతకులు కూవంలో పడేసిన 6 సెల్‌ఫోన్లను పోలీసులు వెలికితీశారు. మరికొన్ని సెల్‌ఫోన్ల కోసం ఆదివారం కూడా వెంగత్తూరులో ఉన్న కూవం నదిలో అగ్నిమాపక సిబ్బందితో గాలించారు.

నేత్రపర్వంగా కళ్లలగర్ రథోత్సవం



ఊరేగుతున్న కళ్లలగర్ స్వామివారి మహారథం

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అళగర్‌మలై దిగువ తిరుమాలిరుంజోలై, తెన్ తిరుపతి (దక్షిణ తిరుపతి)గా కీర్తింపబడుతున్న అళగర్ కోయిల్‌లో ఆడి మాసోత్సవాల సందర్భంగా రథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాలు ఈ నెల 13న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ శ్రీదేవి, భూదేవి సమేత కళ్లలగర్ స్వామి ప్రత్యేక అలంకారంలో వివిధ వాహన సేవలందుకున్నారు. ఈ ఉత్సవా ల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామునే మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సర్వాలంకరణ శోభితుడైన కళ్లలగర్‌స్వామిని రథంలో ప్రత్యేక పీఠంపై ఉంచారు.. ఆ తర్వాత భక్తులంతా రథాన్ని లాగారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు, పోలీసు అధికారులు తగు సదుపాయాలు కల్పించారు. రథం ఊరేగిన ప్రాంతాల్లో భక్త సమాజాల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఆదివారం రాత్రి స్వామివారు పుష్ప పల్లకీలో ఊరేగారు. సోమవారం ఉదయం తీర్థవారీ, మంగళవారం ఉత్సవ శాంతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



శతావధాని శ్యామలానంద ప్రసాద్‌కు గురుశ్రీ బిరుదు ప్రదానం చేస్తున్న ఆచార్య సీఎంకే రెడ్డి, ఏఎం రత్నం

అలరించిన అష్టావధానం

ప్యారీస్, జూలై 21: నగరంలోని శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ సందర్భంగా నిర్వహించిన అచ్చ తెలుగు అష్టావధానం అలరించింది. టి.నగర్ ఆంధ్రా క్లబ్ గోదావరి హాలు వేదికగా ఆదివారం సాయంత్రం ప్రముఖ గాయని పవిత్ర ప్రార్థనా గీతం, ప్రముఖులు జ్యోతి ప్రజ్వలనలతో ప్రారంభమైన ఈ వేడుకల్లో కళాసుధ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... 25 ఏళ్లగా తమ సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషా పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు తెలుగు వారి ఆదరణ లభించిందన్నారు.

కళాసుధలో గురుపూర్ణిమ వైభవం

వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులను ఎంపిక చేసి ప్రతి ఏటా గురుశ్రీ బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది శతావధాని, కుదురాటగండ డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌ను గురుశ్రీ పురస్కారంతో సత్కరించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి సంచాలకులు శతావధాని ఉప్పలదడియం భరత్ శర్మ నేతృత్వంలో అష్టావధాన కార్యక్రమం శ్రావ్యంగా సాగింది. ముఖ్యఅతిథిగా అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి, ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీ నిర్మాత ఏఎం రత్నం హాజరై శ్రీ కళాసుధ సంస్థ సేవలు కొనియాడుతూ బేతిరెడ్డి శ్రీనివాస్‌ను సత్కరించి, అభినందించారు. పృచ్ఛకులుగా ఆచార్య సీఎంకే రెడ్డి, పోలిశెట్టి ఆదినారాయణ, తిరుమల ఆముక్త మాల్యద, డా.ఎలిజబెత్ జయకుమారి, కళాప్రద వ్యవహరించారు. ముందుగా దైవ ప్రార్థన, గురు ప్రార్థన అనంతరం డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌కు గురుశ్రీ బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్యామలానంద ప్రసాద్ మాట్లాడుతూ... తమిళనాడు రాజధాని నగరంలో తొలిసారిగా అచ్చ తెలుగు అష్టావధానంలో పాల్గొని గురుశ్రీ పురస్కారం అందుకోవడం మరపురాని అనుభూతినిచ్చిందన్నారు. గురుపూర్ణిమ అంటే తెలుగులో వజ్ర పున్నమి అని, వజ్రోత్సవం జరుపుకున్న శ్రీకళాసుధ నిర్వహించే పండుగ కార్యక్రమమని అభివర్ణించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతూ 25 ఏళ్లగా కార్యక్రమాలు చేపట్టడం అంత సులువుకాదని, ఓపికతో మాతృభాష పరిరక్షణకు ఈ సంస్థ కృషిచేస్తోందని ప్రశంసించారు. అవధానం అంటే తెలుగులో కుదురాట అని, ఈ ఆట గురుపూర్ణిమ రోజున 8 అంశాల మీద రసరమ్యంగా సాగిందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గసభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమాచార దృష్ని

నేటినుంచి నాదస్వర ఉత్సవాలు

ఐసిఎఫ్, జూలై 21: స్థానిక జీఎన్ శెట్టి రోడ్డులో ఉన్న వాణి మహల్ త్యాగబ్రహ్మ గానసభలో నాదస్వర ఉత్సవాలు సోమవారం నుంచి 24వ తేది వరకు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఉత్తమ నాదస్వర కళాకారులను సన్మానించనున్నారు. సోమ, మంగళ, బుధవారాల్లో సాయంత్రం 6.30 గంటలకు ప్రముఖ నాదస్వర, డోలు విద్వాంసుల సంగీత కచ్చేరి జరుగనుంది. గురు, శుక్రవారాల్లో సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు తమిళ్ సంగీత ఉత్సవాలు జరుగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

29 నుంచి వాలీబాల్ పోటీలు

ఐసిఎఫ్, జూలై 21: చెన్నై జిల్లా వాలీబాల్ సంఘం, సన్ అకాడమీ గ్రూప్ ఆఫ్ స్కూల్ సంయుక్తంగా చెన్నై సిటీ పాఠశాలల మధ్య ఛాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 29 నుంచి 31వ తేది వరకు నిర్వహిస్తున్నాయి. ఎగ్మూర్ రాధాకృష్ణన్ స్టేడియంలో జరుగనున్న ఈ పోటీలకు సంబంధించి 9444842628, 9841816778 నెంబర్లు సంప్రదించాలని వాలీబాల్ సంఘం నిర్వాహకులు తెలిపారు.

థౌజంట్ లైట్స్ బస్టాప్ మార్పు

ఐసిఎఫ్, జూలై 21: మెట్రోరైలు పనుల కారణంగా థౌజంట్ లైట్స్ బస్టాప్‌ను తిరువిక రోడ్డుకు మార్చారు. థౌజండ్ లైట్స్ బస్టాప్ రాయపేట వైట్స్ రోడ్డు-అన్నాసాలై జంక్షన్‌లో ఉంది. ఇక్కడ మెట్రోరైలు పనులు చేపడుతుండడంతో తాత్కాలికంగా బస్టాప్‌ను తిరువిక రోడ్డుకు మార్చారు. ప్యారీస్ నుంచి సైదాపేట, గిండి మీదుగా వెళ్లే ప్రభుత్వ బస్సులు తిరువిక రోడ్డు మీదుగా వెళ్లి పీటర్స్ రోడ్డులో కుడివైపు తిరిగి అన్నాసాలై గుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

క్రోంపేట ఎంఐటీకి 75 వసంతాలు పూర్తి

ఐసిఎఫ్, జూలై 21: స్థానిక క్రోంపేటలో ఉన్న ఎంఐటీ కళాశాల 75 వసంతాలు పూర్తిచేసుకుంది. రాజన్ అనే వ్యక్తి 1949లో ఈ కళాశాలను ప్రారంభించారు. ఇక్కడ చదివిన విద్యార్థులు వివిధ ఉన్నత పదవుల్లో ఉన్నారు. పలు సందర్భాల్లో ప్రధానుల నుంచి ముఖ్యమంత్రుల వరకు కళాశాల కార్యక్రమాల్లో పాల్గొంటుంటారు. కళాశాల 75వ వార్షికోత్సవాలు ఇటీవల ప్రారంభమై శనివారంతో ముగిశాయి. పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

28న తెలంగాణ బోనాల పండుగ

ప్యారీస్, జూలై 21: చెన్నై తెలంగాణా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేది ఆదివారం బోనాల పండుగ కొండితోపు ప్రాంతంలో జరుగనుంది. ఈ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులు ఉదయం 8.11 గంటలకు మింట్ స్ట్రీట్‌లోని రేణుక పరమేశ్వరి (చిన్న కడమ్మ) ఆలయం నుంచి కొండితోపు పార్క్ వెనుకనున్న ఆదిశక్తి అమ్మవారి ఆలయం వరకు బోనాలతో ఊరేగింపులో పాల్గొననున్నారు. బోనాల పండుగలో తెలుగు వారందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాల్సిందిగా తెలంగాణా సంఘం నిర్వాహకులు పిలుపునిచ్చారు.

గ్రూప్-2కు 7.90 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, జూలై 21: టీఎన్‌పీఎస్సీ నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు మొత్తం 7.90 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గ్రూప్-2, గ్రూప్-2ఏ విభాగాల్లో ఖాళీగా ఉన్న 2,327 పోస్టుల భర్తీకి గత నెల 20వ తేది నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో గ్రూప్-2లో 507 పోస్టులు, గ్రూప్-2ఏ విభాగంలో 1,820 పోస్టులున్నాయి. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్షకు దరఖాస్తు స్వీకరణ శుక్రవారం అర్ధరాత్రితో ముగిసింది. కానీ, ఆ రోజు సాంకేతిక లోపం కారణంగా దరఖాస్తుల స్వీకరణ శనివారం అర్ధరాత్రి వరకు పొడిగించారు. దరఖాస్తు సమర్పణ ముగిసిన నేపథ్యంలో, గ్రూప్-2 పరీక్షలకు మొత్తం 7.90 లక్షల మంది దరఖాస్తు సమర్పించారు. ఆ ప్రకారం, ఒక్కో పోస్టుకు 340 మంది పోటీపడుతున్నారని అధికారులు తెలిపారు.

నేటినుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం

పెరంబూర్, జూలై 21: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో 440 ఇంజనీరింగ్ కళాశాలల్లోని బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రభుత్వ కోటాలో 2 లక్షల సీట్లున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25) ప్రభుత్వ కోటా సీట్లకు 2,53,954 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా, వాటిలో 1,99,868 దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం విద్యార్థుల ర్యాంకుల జాబితాను సాంకేతిక విద్య డైరెక్టరేట్ ఈ నెల 10వ తేది విడుదల చేసింది. ఇంజనీరింగ్ కళాశాలల అడ్మిషన్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి సెప్టెంబరు 3వ తేది వరకు జరుగనుంది. 7.5 శాతం కేటాయించిన సీట్లు, ప్రత్యేక విభాగం విద్యార్థులకు సోమవారం కౌన్సెలింగ్ జరుగనుంది. జనరల్ ప్రత్యేక విభాగం విద్యార్థులకు 25 నుంచి, జనరల్ కౌన్సెలింగ్ 29వ తేదీ నుంచి ప్రారంభం కానుందని సాంకేతిక విద్య డైరెక్టరేట్ తెలియజేసింది.

హొగెనేకల్‌లో దోనెల సవారీకి నిషేధం

పెరంబూర్, జూలై 21: ధర్మపురి జిల్లా హొగెనేకల్ జలపాతంలో పర్యాటకుల స్నానాలు, దోనె సవారీకి ఆదివారం కూడా నిషేధం విధించారు. కర్ణాటకలోని డ్యాంల నుంచి విడుదలవుతున్న జలాలు రాష్ట్ర సరిహద్దు పిల్లిగుండు మీదుగా హొగెనేకల్ జలపాతాలకు చేరుకుంటున్నాయి. నీటి ఉధృతి కారణంగా ఈ నెల 15 నుంచి జలపాతాల వద్దకు నిషేధం విధించడంతో పాటు దోనెల సవారీ రద్దుచేశారు. ఈ నేపథ్యంలో, ఆదివారం హొగెనేకల్ వద్ద 56,000 ఘనపుటడుగుల నీరు వస్తుండడంతో దోనెల సవారీ రద్దు, పర్యాటకు స్నానాలకు జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది.

నోటీసు బోర్డులో టీచర్ల ఫొటోలు

ఐసిఎఫ్, జూలై 21: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల ఫొటోలు నోటీసు బోర్డులో అతికించాలని రాష్ట్రప్రభుత్వానికి కేంద్ర విద్యాశాఖ ఆదేశించింది. ఇదివరకే కేంద్ర ప్రభుత్వం జారీచేసిన వివిధ ఉత్తర్వులపై రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. ఏకీకృత విద్యా పథకంలో నిధులు కేటాయించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వాన్ని అధికారులు కోరారు. వివిధ మార్గదర్శకాలు పాటించాలని కేంద్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల ఫొటోలు విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలిసేలా ప్రకటన బోర్డులో అతికించాలని సూచించింది.

సీపీసీఎల్ ఎండీగా శంకర్

ఐసిఎఫ్, జూలై 21: చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా శంకర్ నియమితులయ్యారు. ఈ సంస్థ ఎండీ అరవింద్‌కుమార్ ఇండియన్ ఆయిల్ ముడిచమురు శుద్ధీకరణ కేంద్ర విభాగం డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో సీపీసీఎల్ సాంకేతిక విభాగం డైరెక్టర్ శంకర్ ఎండీగా బాధ్యతలు స్వీకరించారు.

ఆళియారు డ్యాంలో పెరిగిన నీటిమట్టం

సమీప ప్రాంతాలకు వరద హెచ్చరిక

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లాలోని ఆళియారు డ్యాం నీటిమట్టం పెరుగుతుండటంతో సమీప ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. ఆ డ్యామ్‌లో 120 అడుగుల వరకు నీటిని నిల్వ చేసే వీలుంది. గత వారం రోజులు ఆ డ్యాం పరిసర ప్రాంతాల్లో కుండపోతగా వర్షాలు కురవడంతో ఈ నెల 16న డ్యాంలో నీటిమట్టం 91 అడుగులకు పెరిగింది. 18న నీటిమట్టం వందడుగులకు చేరింది. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు డ్యాంకు ఇన్‌ఫ్లో పెరగటంతో ఒకేసారి 109 అడుగులకు, మధ్యాహ్నానికల్లా 110 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఆ డ్యామ్‌లోకి సెకనుకు 2634 ఘనపుటడుగుల మేర నీరు ప్రవేశిస్తోంది. ఈ పరిస్థితులలో ఆ డ్యాం పరిసరాల్లో ఉన్న ఆళియారు, ఆనమలై, కోట్టూరు, మైలాడుదురై, రమణముదలిపుదూరు తదితర ప్రాంతాల్లోని ప్రజలకు అధికారులు వరద హెచ్చరిక జారీ చేశారు. ఆళియారు జలాశయం వద్దకు స్థానికులు వెళ్లొద్దని, ఎవరూ స్నానాలు చేయకూడదని అధికారులు హెచ్చరించారు. రెండు రోజుల్లో డ్యాం నీటిమట్టం 115 అడగులకు చేరే అవకాశం ఉందని, సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలంతా తప్పకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని అధికారులు ప్రకటనలు జారీ చేశారు.



జలకళ సంతరించుకున్న ఆళియారు జలాశయం

రూ.198 కోట్ల ఖనిజ సంపద దోపిడీ

● సేలం డీఐజీకి హైకోర్టు నోటీసు

ప్యారీస్, జూలై 21: ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో ఆలయాలకు సంబంధించిన భూముల్లో రూ.198.65 కోట్ల విలువైన ఖనిజ సంపద దోపిడీకి గురైన కేసులో నివేదిక ఇవ్వాలని సేలం డీఐజీకి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా హిందూ దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలకు కోట్లాది రూపాయల విలువచేసే భూములున్నాయి. వీటిలో సేలంలో ఉన్న ఆలయాలకు చెందిన భూముల్లో కొందరు ఖనిజ సంపద దోచుకున్నారని, దీనికి సంబంధించి చర్యలు తీసుకోవాల్సిందిగా హైకోర్టులో రాధాకృష్ణన్ అనే వ్యక్తి కేసు వేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి ఎస్ఎం సుబ్రమణ్యం సమక్షంలో దేవాదాయ శాఖ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది అరుణ్ నటరాజన్, ప్రభుత్వ అదనపు న్యాయవాదులు భరణీధరన్, స్టాలిన్ అభిమన్యు హాజరుకాగా, కృష్ణగిరి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.జ్యోతిలక్ష్మి హాజరై నివేదిక అందజేశారు. ఆ నివేదిక పరిశీలించిన అనంతరం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అందులో... దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన నివేదిక దిగ్భ్రాంతికి గురిచేసిందని, కృష్ణగిరి జిల్లాలోని డెంకణికోట, నాగమంగళం ప్రాంతాల్లో ఉన్న హనుమంతరాయ స్వామి ఆలయానికి చెందిన భూముల్లో రూ.28.51 కోట్ల విలువైన రాళ్లు, బొలరపల్లి పట్టాలమ్మన్ ఆలయ భూముల నుంచి రూ.170 కోట్ల విలువగల రాళ్లు దోపిడీకి గురైనట్లు నివేదికలో తెలిసిందని న్యాయమూర్తి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆలయ భూముల్లోకి దేవాదాయ శాఖ అధికారులు వెళ్లి పరిశీలించకుండా సంఘ విద్రోహులు అడ్డుకుంటున్నట్లు రాసారని, కృష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లో రూ.198.65 కోట్ల విలువగల ఖనిజ సంపద దోపిడీ పాలైనట్లు పోలీస్‌స్టేషన్లలో వందల సంఖ్యలో నమోదైన కేసులకు సంబంధించిన దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదన్నారు. ఈ దోపిడీలో పోలీసు, రెవెన్యూ, మరి కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు సంబంధాలున్నట్లు న్యాయస్థానం భావిస్తోందని, దేశానికి సంబంధించిన ఆస్తులను కొల్లగొడుతున్న వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో సమగ్రమైన వివరాలతో కూడిన నివేదికను ఈ నెల 26వ తేదిలోగా న్యాయస్థానంలో నేరుగా హాజరై దాఖలుచేయాల్సిందిగా సేలం డీఐజీకి ఉత్తర్వులు జారీచేశారు.

జస్టిస్ చంద్రు కమిషన్ సిఫార్సులు చదవండి

● అన్నామలైకు సీపీఎం హితవు

పెరంబూర్, జూలై 21: పాఠశాల విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందించేందుకు జస్టిస్ చంద్రు కమిషన్ చేసిన సిఫార్సులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చదవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ సూచించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని కొన్ని పాఠశాలల్లో అంటరానితనానికి సంబంధించిన అవాంఛనీయ సంఘటనల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రు నేతృత్వంలో కమిషన్ నియమించిందని, ఈ కమిషన్ తమ నివేదికను ముఖ్యమంత్రికి అందజేసిందన్నారు. నివేదికలోని కొన్ని అంశాలు మీడియాలో ప్రధానాంశాలుగా మారాయని తెలిపారు. నివేదికలోని అంశాలేమిటో తెలుసుకోకుండానే బీజేపీ నివేదికను తిరస్కరిస్తూ తీర్మానం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.జస్టిస్ చంద్రు నిజాయితీగా పని చేసినందుకు రాష్ట్ర ప్రజల్లో మంచి ఆదరణ పొందుతున్నారని, ఇది చూసి ఓర్వలేని బీజేపీపై ఆయనను విమర్శించడం తగదన్నారు. 'అస్పృశ్యత మహా నేరం-దానిని నిర్మూలించాలి' అనే భావనతో రాష్ట్రంలో పాఠ్యపుస్తకాలు వెలువడుతున్నాయని తెలిపారు. విద్యార్థి దశలోనే వారికి కులం ప్రాతిపదికన విభజించి కుల సెంటిమెంట్ రేపి రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ పావులు కదుపుతోందని, సమానత్వం అంటేనే బీజేపీకి చేదుగా ఉంటుందని బాలకృష్ణన్ విమర్శించారు.

రైలు ప్రమాదాలను అడ్డుకోండి

● టీఎన్‌సీసీ నేత సెల్వపెరుందగై

పెరంబూర్, జూలై 21: రైలు ప్రమాదాలు అడ్డుకొనేలా బీజేపీ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... గత పదేళ్లలో దేశంలో జరిగిన రైలు ప్రమాదాల్లో 2.60 లక్షల మంది మృత్యువాతపడ్డారని జాతీయ నేరాల కమిషన్ సర్వేలో వెల్లడైందన్నారు. బీజేపీ పాలనలో రైల్వే శాఖ నిర్వీర్యమైందన్నారు. ఇప్పటికైనా స్పందించి రైలు ప్రమాదాలు అడ్డుకొనేలా చర్యలు చేపట్టాలని, లేకపోతే బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని సెల్వపెరుందగై హెచ్చరించారు.

1,000 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, జూలై 21: నీలగిరి సహా వివిధ జిల్లాల్లోని జల విద్యుత్ కేంద్రాల్లో భారీవర్షాల కారణంగా ఉత్పత్తి 1,000 మెగావాట్లకు పెరిగింది. నీలగిరిలో కుంద, కోయంబత్తూర్‌లో కాడంపారై, తిరునల్వేలి, ఈరోడ్ జిల్లాల్లో విద్యుత్ బోర్డుకు 2,321 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 47 జలవిద్యుత్ కేంద్రాలున్నాయి. గత సీజన్‌లో వర్షాలు తక్కువగా కురవడంతో గత జూన్ వరకు ప్రతిరోజు 200 నుంచి 250 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగేది. ప్రస్తుతం నీలగిరి, ఈరోడ్ వంటి జిల్లాల్లో వర్షాలు బాగా కురుస్తుండడంతో ప్రజాపనుల శాఖ ఆధీనంలోని డ్యాం నుంచి వ్యవసాయానికి విడుదల చేస్తున్న నీటి ద్వారా ప్రతిరోజు 250 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. విద్యుత్ బోర్డు ఆధ్వర్యంలో ఉన్న 36 డ్యాంలలో 50 శాతం నీటినిల్వలున్నాయి. ఇన్‌ఫ్లో పెరగడంతో ప్రతిరోజు 1,000 మెగావాట్లకు పైగా విద్యుదుత్పత్తి జరుగుతోంది.

బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న తమిళులు..

తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

పెరంబూర్, జూలై 21: బంగ్లాదేశ్‌లో చిక్కుకొని రాష్ట్రానికి రాలేకపోతున్న తమిళులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామని రాష్ట్రప్రభుత్వం తెలియజేసింది. బంగ్లాదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపడుతున్న ఆందోళనలు హింసకు దారితీసి 120 మంది మృతిచెందారు. దీంతో, ఆ దేశంలో కర్ఫ్యూ ప్రకటించారు. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో రాష్ట్ర విద్యార్థులు చిక్కుకున్నారు. వారిని కళాశాల బస్సుల్లో తీసుకొచ్చి బంగ్లాదేశ్ సరిహద్దుల్లో వదిలివెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై రాష్ట్రప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... బంగ్లాదేశ్ చిక్కుకున్న రాష్ట్రానికి చెందిన వారికి సురక్షితంగా తీసుకొచ్చేలా చర్యలు చేపట్టామని తెలిపింది. తొలివిడతగా రెండు విమానాల్లో 35 మంది రాష్ట్రానికి చేరుకోనున్నారని తెలిపింది. రెండవ విడతగా మరో 60 మందిని తీసుకురానున్నామని, ముఖ్యమంత్రి స్టాలిన్ సూచనలతో భారత రాయబారి కార్యాలయం సహకారంతో తమిళులను రక్షించేందుకు ప్రయత్నాలు చేపట్టినట్లు ప్రభుత్వం ప్రకటనలో తెలియజేసింది.

ఆర్ఎస్ఎస్‌లోకి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు

● ఎంపీ వెంకటేశన్ ఖండన

పెరంబూర్, జూలై 21: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను ఆర్ఎస్ఎస్‌లోకి పంపించేలా చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వ తీరును మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్‌లో... కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ సంస్థలో చేరేందుకు అనుమతి లేదనానరు. కానీ, ప్రస్తుతం అందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. సావర్కర్ జయంతి రోజున కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం, ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్ఎస్ఎస్ సంస్థలో చేర్చే పనులు చేపట్టిన కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తున్నట్లు ఎంపీ పోస్ట్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై21:విద్యుత్‌మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అడయార్: గాంధీ నగర్ 2వ మెయిన్ రోడ్డు, 2వ క్రాస్ వీధి, 3వ మెయిన్ రోడ్డు. **పల్లావరం:** మల్లికా నగర్, వైద్యలింగం రోడ్డు, కట్టబొమ్మన్ నగర్, ఆర్కేవీ అవెన్యూ, తిరుమురుగన్ నగర్, మాణిక్యం నగర్, వేల్ కాలేజ్ మెయిన్ రోడ్డు, బంగారు నగర్ ఈస్ట్. **ఐటీ కారిడార్:** ఆనంద్ నగర్, 200 అడుగుల రేడియల్ రోడ్డు, సాయి నగర్.

తండయార్‌పేట: నేతాజీ నగర్, నెహ్రూ నగర్, కుమరన్ నగర్, శివాజీ నగర్, సుందరంపిళ్లై నగర్, వీహెచ్ రోడ్డు, అన్నై సత్యా నగర్, పటేల్ నగర్, పరమేశ్వరన్ నగర్, అజీస్ నగర్, నావలర్ కాలని, దుర్గాదేవి నగర్, బేసిన్ రోడ్డు, బర్మా కాలని, రాజీవ్ గాంధీ నగర్, కరుణానిధి నగర్, ఇందిరా గాంధీ నగర్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, నెడుంజెలియన్ నగర్, వైద్యనాథన్ నగర్, కార్పోరేషన్ నగర్, ఎళిల్ నగర్, చంద్రశేఖర్ నగర్, కేహెచ్ రోడ్డు, మూపనార్ నగర్, మనలి రోడ్డు, తిరువళ్లువర్ నగర్, మీనాంబాళ్ నగర్, అన్నా నగర్, జేజే నగర్, సున్నాంబు కాలువ, వావూసీ నగర్, కరుమారియమ్మన్ నగర్, మాతా ఆలయ వీధి, త్యాగప్పశెట్టి వీధి, జీవా నగర్, కామరాజ్ నగర్, సుందరపురం, చిగురింతపాళయం, మోక్షాపురం, భారతి నగర్, భారతి నగర్ హౌసింగ్ బోర్డు, రిక్షా కాలని, న్యూ శాస్త్రి నగర్.

బర్మా బజార్‌లో దుకాణాల సీజ్

పెరంబూర్, జూలై 21: స్థానిక బర్మా బజార్‌లో అద్దె బకాయిలు చెల్లించని 100 దుకాణాలకు అధికారులు సీలు వేశారు. బ్రాడ్‌వే సమీపంలోని రాజా అన్నామలై మండ్రం ఎదురుగా 256 దుకాణాలను నిర్మించిన కార్పొరేషన్, ఒక దుకాణాన్ని నెలకు రూ.509 చొప్పున అద్దెకిచ్చింది. వాటిలో మూడు నెలల నుంచి సంవత్సరం వరకు వంద దుకాణాల యజమానులు అద్దె చెల్లించలేదు. దుకాణాల అద్దెబకాయిలు రూ.6.50లక్షలకు చేరుకోవడంతో,కార్పొరేషన్ నోటీసులిచ్చినా ఎలాంటి స్పందన లేపోయింది. దీంతో, శనివారం రాయపురం రెవెన్యూ అధికారుల బృందం బర్మా బజార్‌లోని వంద దుకాణాలకు సీలు వేసింది.

డీఎంకే నుంచి ప్రజలను రక్షించాలి

● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

పెరంబూర్, జూలై 21: అధికార డీఎంకే కబంధ హస్తాల నుంచి ప్రజలను రక్షించాలని, అది ఎన్డీఏ కూటమి వల్లే సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నీలగిరి నియోజకవర్గం నుంచి డీఎంకే తరఫున పోటీచేసిన కేంద్ర మంత్రి మురుగన్ పరాజయం పాలయ్యారు. ఈ నేపథ్యంలో, తనకు ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమం శనివారం అవినాశిలో జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో శాంతి భద్రతల పర్యవేక్షణలో డీఎంకే విఫలమైందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు భయాందోళనలతో జీవిస్తున్నారని, వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ఎన్డీఏ కూటమి పార్టీలకు ఉందన్నారు. దేశాన్ని అగ్రస్థానంతో నిలపాలన్న నరేంద్ర మోదీ లక్ష్యాన్ని అంగీకరించిన ప్రజలు మూడో సారి ఆయనకు ప్రధాని బాధ్యతలు అందించారని కేంద్ర మంత్రి తెలిపారు.

343 మంది టీచర్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి

పెరంబూర్, జూలై 21: ప్రభుత్వ పాఠశాలల్లో పీజీ టీచర్లుగా పనిచేస్తున్న వారిలో 343 మంది మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందినట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది, రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల కౌన్సెలింగ్ 'ఎమిస్' యాప్ ద్వారా ఈ నెల 1వ తేది నుంచి జరుగుతోంది. ఇప్పటివరకు 5,000 మంది యూజీ, పీజీ టీచర్ల బదిలీలు జరిగాయి. ఈ క్రమంలో, ప్రభుత్వ మహోన్నత పాఠశాలల పీజీ టీచర్ల పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించగా, 343 మంది ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. ఈ విషయమై పాఠశాల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుత విద్యా సంవత్సరం ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు దృష్టిలో ఉంచుకొని మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ చేశామన్నారు. ఈ నెల 31వ తేదీతో ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ముగియనుందని, జీవో 243 ప్రకారం 2,200 మందికి పైగా ఉపాధ్యాయులు ఈ కౌన్సెలింగ్ ద్వారా లబ్ధిపొందారని అధికారులు తెలిపారు.

ఎంపీ దయానిధి మారన్ గెలుపును వ్యతిరేకిస్తూ పిటిషన్

పెరంబూర్, జూలై 21: మధ్య చెన్నై నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థి దయానిధి మారన్‌ను గెలుపును వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇటీవల ముగిసిన పార్లమెంటు ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి పోటీచేసిన న్యాయవాది ఎంఎల్ రవి దాఖలుచేసిన పిటిషన్‌లో.... పార్లమెంటు ఎన్నికల ప్రచారం ఏప్రిల్ 17వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, దయానిధి మారన్ పేరుతో ఎన్నికల పోలింగ్ రోజైన 19వ తేది పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారని, అది ఎన్నికల నిబంధనలు అతిక్రమించి, ఓటర్లను మభ్యపెట్టడమేనని తెలిపారు. ఆయన ఎన్నికల ప్రచార ఖర్చు, ప్రకటనల ఖర్చు బూత్ ఏజెంట్లకు అందజేసిన నగదు వివరాలు సక్రమంగా పేర్కొనలేదని, ఎన్నికల కమిషన్ అనుమతించిన రూ.95లక్షలకన్నా అధికంగా వినియోగించారని, ఆయన గెలుపుచెల్లదని ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు.ఈపిటిషన్ త్వరలో విచారణకు రానుంది.

ఆగస్టు 31న నగరంలో 'ఫార్ములా 4 రేస్'...?

పెరంబూర్, జూలై 21: నగరంలో 'ఫార్ములా-4 రేస్' ఆగస్టు 31, సెప్టెంబరు 1వ తేదీల్లో నిర్వహించనున్నట్లు సమాచారం. రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ కమిషన్, ప్రైవేటు సంస్థలు సంయుక్తంగా 'ఫార్ములా రేసింగ్ సర్క్యూట్ ఎఫ్ 4' అనే పోటీలు గత ఏడాది డిసెంబరు 9,10 తేదీల్లో జరపాలని నిర్ణయించారు. ఐల్యాండ్ గ్రౌండ్ సమీపంలో జరుగనున్న ఈ పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.40 కోట్లు కేటాయించింది. ర్యాలీ జరిగే రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు సమయంలో తుఫాను కారణంగా పోటీలు వాయిదాపడ్డాయి. అదే సమయంలో, నగరంలో ఈ రేస్ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కేసు విచారించిన న్యాయస్థానం, కొన్ని నిబంధనలతో రేస్ నిర్వహణకు అనుమతి మంజూరుచేసింది. ఈ నేపథ్యంలో, నగరంలో ఈ రేస్ ఆగస్టు 31, సెప్టెంబరు 1వ తేదీల్లో నిర్వహించనున్నట్లు సమాచారం. త్వరలో రేస్ నిర్వహణపై ప్రభుత్వం అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది.

4,612 పరిశ్రమల్లో తగ్గిన వ్యర్థాల ఉత్పత్తి

ఐసిఎఫ్, జూలై 21: రాష్ట్రంలో 4,612 కర్మాగారాల్లో హానికారక వ్యర్థాల ఉత్పత్తి తగ్గినట్లు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు తెలిపారు. వ్యర్థాలు ఎక్కువగా విడుదల చేసే కర్మాగారాలను గుర్తించిన కాలుష్య నియంత్రణ బోర్డు వాటికి మార్గదర్శకాలు సూచించింది. బోర్డు సలహాలు పాటించిన కర్మాగారాలు ఉత్పత్తి విధానాల్లో మార్పులు చేపట్టాయి. ఈ కారణంగా 4,612 కర్మాగారాల్లో వ్యర్థాలు ఎక్కువగా ఉత్పత్తి కావడం తగ్గిందని అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కామాక్షి అమ్మన్ క్షీరాభిషేకం



పాల కలశాలతో ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న భక్తులు

వేలూరు, జూలై 21: స్థానిక చూలైమేడులో ఉన్న కామాక్షి అమ్మన్ ఆలయ 15వ వార్షిక వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు 108 పాల కలశాలతో ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, మహా దీపారాధన నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమ ఏర్పాట్లను రిటైర్డ్ సీఎంసీ అధికారి వరదరాజన్, దీనదయాళన్, సునంద, ప్రసన్న కుమార్ పర్యవేక్షించారు.

కుమార్తె మృతి తట్టుకోలేక తల్లి ఆత్మహత్య

పెరంబూర్,జూలై21: కుమార్తె మృతి తట్టుకోలేని తల్లి ఆత్మహత్యకు పాల్పడినఘటన తిరువొత్తియూర్‌లో చోటుచేసుకుంది.కాలడిపట్టి అయ్యాపిళ్లై గార్డెన్‌కు చెందిన గుణశేఖరన్-సుధ (38) దంపతుల కుమార్తె రాఘవి (17) ప్లస్ టూ చదువుతోంది. ఆ విద్యార్థిని ఓ యువకుడిని ప్రేమిస్తున్నట్లు తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను మందలించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, ఈ నెల 15న ప్రియుడితో సెల్‌ఫోన్‌లో మాట్లాడిన రాఘవి, గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుమార్తె మృతితో తీవ్ర మనస్థాపంతో ఉన్న సుధను బంధుమిత్రులు ఓదార్చారు. ఈ క్రమంలో, శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై తిరువొత్తియూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఒమెన్ ప్రమాదంలో గల్లంతైన భర్త కలెక్టరేట్ ఎదుట భార్య ధర్నా



భర్త ఫొటోతో కడలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎళిల్ అరసి

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ ఓడరేవు నుంచి వెళ్లి ఓమెన్ ఏడెన్ రేవుకు చమురు లోడుతో వెళ్లిన నౌకా ప్రమాదంలో గల్లంతయిన భర్త ఆచూకీ గుర్తించి స్వస్థలానికి చేర్చాలని కోరుతూ కడలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అతడి భార్య ధర్నా నిర్వహించింది. నౌకా ప్రమాదంలో 13 మంది భారతీయులు సహా 16 మంది నీట మునిగారు. వీరిలో 10 మంది సురక్షితంగా బయటపడ్డారు. తక్కిన ముగ్గురి జాడ తెలియలేదు. ప్రమాదానికి గురైన నౌకలో కడలూరు ముత్తునగర్ భగవాన్ మహావీర్ వీధికి చెందిన ధనంజయన్ కూడా గల్లంతయ్యారు. అతడి ఆచూకీ కనుగొని వీలైనంత త్వరగా స్వస్థలానికి రప్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ భార్య ఎళిల్‌అరసి కుటుంబ సభ్యులతోపాటు ధర్నా నిర్వహించింది. భర్త ఫొటోతో ధర్నా చేసిన ఆమె కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించింది. ధనంజయన్ ఆచూకీ కనుగొని వీలైనంత త్వరగా అతడిని స్వస్థలానికి చేర్చేందుకు చర్యలు చేపడతామంటూ కలెక్టర్ సిబి ఆదిత్యా సెంథిల్ కుమార్ హామీ ఇచ్చారు.

రైల్వే గేటు సమీపంలో గుర్తుతెలియని మృతదేహం

వేలూరు, జూలై 21: విరుదంబట్టు సమీపం తండలం కృష్ణావరం రైల్వే గేట్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని ఆ ప్రాంత ప్రజలు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతడిని ఎవరైనా హత్య చేసి ఇక్కడ పడేశారా, రైలు నుండి జారిపడి మృతిచెందాడా అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.

రూ.4 కోట్లు స్వాధీనం కేసు.. ముమ్మరంగా సీబీసీఐడీ దర్యాప్తు

ప్యారీస్, జూలై 21: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ఏప్రిల్ 6వ తేది తాంబరం రైల్వేస్టేషన్‌లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం కేసు దర్యాప్తును సీబీసీఐడీ వేగవంతం చేసింది. ఈ నగదును తరలించిన సతీష్, నవీన్, పెరుమాళ్ తదితరులను అరెస్ట్ చేసి విచారించగా. ఆ నగదు నగరంలో పలు ప్రాంతాల నుంచి చేతులు మారినట్లు తెలిసింది. తిరునల్వేలి పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల ఖర్చు కోసం ఈ నగదు తరలించామని, ఈ నగదు బీజేపీ తరఫున పోటీచేసిన నయినార్ నాగేంద్రన్‌కు చెందినదని పట్టుబడిన ఆ ముగ్గురు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో, ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సీబీసీఐడీ అధికారులు పలు కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు 15 మంది బీజేపీ నాయకులను విచారించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఎగ్మూర్‌లో ఉన్న సీబీసీఐడీ కార్యాలయంలో జరిగిన విచారణకు నయినార్ నాగేంద్రన్, ఎస్సార్ శేఖర్, బీజేపీ న్యాయవాది పాల్ కనకరాజ్, నీల మురళియాదవ్ తదితరులు హాజరై వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో, షావుకారుపేటలో ఉన్న ఓ జ్యువెలరీ షాపు యజమాని నుంచి రూ.4 కోట్ల నగదు వచ్చిందని విచారణలో తెలిసింది. అందువల్ల ఆయన విచారణకు హాజరుకావాలంటూ సీబీసీఐడీ పోలీసులు సమన్లు జారీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

సెంథిల్ బాలాజీకి అస్వస్థత

పెరంబూర్,జూలై21:చట్టవ్యతిరేక నగదు బట్వాడా కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్‌చేసిన మాజీ మంత్రి సెంథిల్ బాలాజి పుళల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో, ఆదివారం మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం సెంథిల్ బాలాజీ హఠాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. ఆయనను వెంటనే స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్సకు ఓమందూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెంబరంబాక్కంలో మృతిచెందుతున్న చేపలు



మృతిచెందిన చేపలు

ఐసిఎఫ్, జూలై 21: నగరానికి తాగునీటి ఆధారమైన చెంబరంబాక్కం జలాశయంలో చేపలు మృతిచెంది తేలుతున్నాయి. ఈ జలాశయానికి కృష్ణ కాలువ, చౌదరి కాలువ, బంగారు కాలువల ద్వారా నీరు వస్తోంది. ఇరుంకాట్టుకోట సిప్కాట్, చెంబరంబాక్కం, పలంజూరు, పాపన్‌సత్రం వంటి పలు గ్రామాల నుంచి విడుదలయ్యే మురుగునీరు ఈ కాలువ ద్వారానే చెంబరంబాక్కం జలాశయంలో కలుస్తుంది. పలు సంవత్సరాలుగా ఇలా మురుగునీరు కలుస్తుండడంతో నీరు కలుషితం అవుతోంది. ఈ నేపథ్యంలో, శనివారం జలాశయంలో వందల సంఖ్యలో మృతిచెందిన చేపలు నీళ్లపై తేలుతున్నాయి. దీనిపై సంఘ శ్రేయోభిలాషులు మాట్లాడుతూ... నీరు కలుషితం కావడంతో ఆక్సిజన్ అందక చేపలు మృతిచెందుతున్నాయని, ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పొరప్పనైకోటలో రాగి మేకులు లభ్యం



తవ్వకాల్లో బయల్పడిన రాగి మేకులు

ఐసిఎఫ్, జూలై 21: పుదుకోట జిల్లా పొరుప్పనైకోట పురావస్తు తవ్వకాల్లో పూర్వీకులు వినియోగించిన రాగి మేకులు లభ్యమయ్యాయి. ఈ ప్రాంతంలో రెండో విడత తవ్వకాల్లో అంతఃపురం మైదానంలో ఇటుకల నిర్మాణం, గాజు పూసలు, పచ్చరాళ్ల దండలు, ఇనుప మేకులు వంటివి లభించగా, శనివారం తవ్వకాల్లో ఐదు రాగి మేకులు లభించాయి. ఒక మేకు 2 గ్రాముల బరువు, 2.3 సెం.మీ పొడవు, 1.2 సెం.మీ మందం కలిగి ఉన్నాయి. వీటితో పాటు 3 సెం.మీ పొడవున్న చర్మకోల్ లభించినట్లు పురావస్తు పరిశోధకులు తెలిపారు.

ఐదురోజుల విరామం తర్వాత చేపలవేటకు వెళ్లిన రామేశ్వరం జాలర్లు



రామేశ్వరం రేవులో సిద్ధంగా ఉన్న మర పడవలు

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సముద్రతీరంలో ఐదురోజులుగా వీచిన పెనుగాలులు, ఎగసిపడిన అలల కారణంగా ఆగిపోయిన చేపలవేట ఆదివారం మళ్ళీ ఆరంభమైంది. శనివారం అర్ధరాత్రి నుంచి మన్నార్‌జలసంధి, పాక్ జలసంధి ప్రాంతాల వద్ద పెనుగాలులు తగ్గాయి. దీంతో వేకువజామునే పాంబన్, మండపం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 1500 మంది జాలర్లు చేపలవేటకు బయలుదేరి వెళ్ళారు. ఇదే విధంగా ధనుష్కోడి, పాంబన్, మండపం, కీళ్‌క్కరై, ఏర్‌వాడి తదితర చేపలరేవుల నుండి సుమారు రెండు వేల మంది జాలర్లు చేపలవేటకు వెళ్ళారు.

బాధితుడికి ఆక్సిజన్ పరికరం అందజేత



ఆక్సిజన్ పరికరం అందజేస్తున్న జనార్ధనన్

వేలూరు, జూలై 21: అస్వస్థతకు గురైన వ్యక్తి ఇంట్లోనే చికిత్సపొందేలా ఉచిత ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ అందజేశారు. అత్యవసరంగా ఆక్సిజన్ అవసరమయ్యే బాధితులకు వైద్యుడి సిఫార్సుతో రెడ్‌క్రాస్ తరఫున ఉచిత ఆక్సిజన్ సెర్వ్యూటీ అందజేస్తున్నారు. ఈ విషయమై రెడ్‌క్రాస్ విడుదల చేసిన ప్రకటనలో... శనివారం రాత్రి 12.30 గంటలకు ఆక్సిజన్ పరికరం అవసరమైన వ్యక్తికి ఉచితంగా అందజేశామన్నారు. వైద్యుల సూచన మేరకు రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్, సెక్రటరీ వడివుడవు తదితరులు సూచనలతో బాధితురాలి కుటుంబసభ్యులకు అవైై అధ్యక్షుడు జనార్ధనన్ పరికరాన్ని అందజేశారు. ఈ విషయమై జనార్ధనన్ మాట్లాడుతూ..., కరోనా సమయంలో అత్యవసరంగా ఆక్సిజన్ అవసరమైన వారికి ఈ సంఘం ద్వారా ఉచితంగా పరికరం అందజేస్తున్నామన్నారు. 15 రోజులు ఈ పరికరాన్ని వినియోగించుకోవచ్చిన, పరికరం మరమ్మతులకు గురైతే లబ్దిదారుల నుంచి మరమ్మతు ఖర్చులు వసూలుచేయనున్నామని తెలిపారు. లబ్దిదారులు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి పరికరం తీసుకెళ్లొచ్చని, యంత్రం తిరిగి అందజేసే సమయంలో డిపాజిట్ అప్పగిస్తామని జనార్ధనన్ తెలిపారు.

కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో 'రఘు తాతా'


'రఘు తాతా' ఆడియో రిలీజ్ వేడుకలో చిత్ర బృందం

'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' వంటి పాన్ ఇండియా చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే తాజాగా ప్రముఖ హీరోయిన్ కీర్తి సురేష్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'రఘు తాతా'. సుమన్ కుమార్ దర్శకుడు. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫార్జీ' వంటి హిట్ వెబ్ సిరీస్‌లకు కథా రచయితగా ఆయన పని చేశారు. 'రఘు తాతా'లో కీర్తి సురేష్, ఎంఎస్ భాస్కర్, రవీంద్ర విజయ్, ఆనంద్ స్వామి, దేవ దర్శిని, రాజీవ్ రవీంద్రనాథన్ తదితరులు నటించారు. హోంబలే సంస్థ నిర్మించిన తొలి తమిళ చిత్రం ఇదే కావడం గమనార్హం. లేడీ ఓరియంటెడ్ మూవీ అయినప్పటికీ ఒక యూనిక్ పాయింట్‌తో నిర్మాణ సంస్థ తెరకెక్కించింది. వచ్చే నెల 15వ తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని ఆడియో, ట్రైలర్ శనివారం నగరంలో రిలీజ్ చేశారు. ఇందులో దర్శకుడు సుమన్ కుమార్ మాట్లాడుతూ 'రఘు తాతా'కు దర్శకత్వం వహిస్తానని అనుకోలేదు. హిందీ వ్యతిరేక నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఒక వ్యక్తి తన పదోన్నతి కోసం హిందీ పరీక్ష రాసిన విషయం నా దృష్టికి వచ్చింది. అదే ఈ చిత్రానికి మూలకథ. అయితే, ఈ కథతో పాటు పూర్తి స్క్రిప్టు సిద్ధం కావడానికి మూల కారణం సహ రచయితలైన ఆనంద్, మనోజ్. ఈ సినిమాలో హిందీ భాషను బలవంతంగా ప్రయోగించడాన్ని చూపించలేదు. కానీ, మహిళలపై బలవంతంగా రుద్దడాన్ని కామెడీ టచ్‌తో రూపొందించాం' అని తెలిపారు. హీరోయిన్ కీర్తి సురేష్ మాట్లాడుతూ, 'ఒక మంచి సినిమాలో నటించాను. ఈ స్క్రిప్టును ప్రేక్షకుల చెంతకు ఎలా చేర్చుతారన్న భయం ఉండేది. దాన్ని దర్శకుడు చక్కగా మలిచారు. సుమన్ కుమార్ దర్శకుడిగా పరిచయమవుతూ రూపొందిన చిత్రంలో నటించడం చాలా సంతోషంగా ఉంది. అలాగే, బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాలను నిర్మించిన హోంబలే బ్యానరుతో కలిసి పనిచేయడం రెట్టింపు ఆనందాన్నిస్తుందన్న కీర్తి నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

చిత్రజ్యోతి

నిత్యం భయంతో బతుకుతున్నాం

● సింగర్ అరివు


అరివు, రంజిత్, ఇమ్మాన్ తదితరులు

మనమంతా నిత్యం భయం గుప్పెట్లో జీవిస్తున్నామని, ఎపుడు చంపేస్తారో తెలియదని, అందుకే తాను పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉంటున్నానని సోలో సింగర్ అరివు అభిప్రాయపడ్డారు. 'వల్లియమ్మా పేరాండి' పేరుతో ఆయన రూపొందించిన ఆల్బమ్‌ను ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ ఆవిష్కరించారు. ఈ ఆల్బమ్‌లో మొత్తం 12 పాటలున్నాయి. ఈ సందర్భంగా ఆల్బమ్ రూపకర్త అరివు మాట్లాడుతూ, 'గ్రామాల్లో జరిగే వేడుకల్లో ఆలపించే జానపద గేయాలను వింటూ పెరిగాను. ఇపుడు సోలో సింగర్‌గా అవడానికి ప్రధాన కారణం దర్శకుడు పా.రంజిత్. అణగారిన వర్గాలకు చెందిన ప్రజలు కూడా సూటు కోటు ధరించి వేదికలపై నిలబడవచ్చనే నమ్మకాన్ని 'కాస్‌లెస్ కలెక్టివ్' కలిగించింది. ఇప్పటివరకు నేను పుట్టిన రోజు వేడుకలను జరుపుకోలేదు. నన్ను ఎపుడు చంపేస్తారో తెలియని భయం వెంటాడుతుంది. బీఎస్పీ రాష్ట అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య జీర్ణించుకోలేకపోతున్నాను. రెండేళ్ళపాటు కష్టపడి రూపొందించిన ఆల్బమ్‌ను ఆదరించాలని ఆయన కోరారు. పా.రంజిత్ మాట్లాడుతూ, అరివు రాసిన పాటలన్నీ బాగున్నాయి. ఎంతో ఆసక్తిగా జనరంజకంగా ఉన్నాయి. అరివులోని అంబేడ్కర్ భావజాలం, దృక్పథమే మా ఇద్దరిని దగ్గరికి చేర్చింది. అరివు ఆలపించే పాటల్లోని రాజకీయ స్వరూపం ప్రజల్లోకి చేరడం మొదలైంది. దళిత సుబ్బయ్య వంటివారు ఆలపించిన పాటలు ప్రజలకు చేరలేదు. పాటలు ప్రజలకు చేరువైనపుడే ఆదరణ పొందుతాయి. అరివు రాసిన 'ఎంజామి' పాట బాగా పాపులర్ అయింది. కెరీర్ ఆరంభంలో అరివు రాసిన పాటలు కొంతమేరకు వివాదం అయినప్పటికీ... ఆ సమస్య నుంచి గట్టెక్కేందుకు కొంత సమయం పట్టింది' అని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు విడుదలకానున్న 'అంథగన్'


'అంథగన్'లో ప్రశాంత్, సిమ్రాన్

ప్రశాంత్ కథానాయకుడిగా నటించిన 'అంథగన్' చిత్రం వచ్చే నెల 15వ తేదీ విడుదలకానుంది. చిత్రీకరణ ఎపుడో పూర్తి చేసుకున్నప్పటికీ రిలీజ్ చేయడంలో జాప్యం నెలకొంది. బాలీవుడ్‌లో శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వంలో ఆయుష్మాన్ ఖురానా, టబు తదితరులు నటించిన ఈ చిత్రం 2018లో విడుదలై సూపర్‌హిట్ సాధించింది. ఈ సినిమాను తమిళంలోకి ప్రశాంత్ హీరోగా ఆయన తండ్రి, సీనియర్ నటుడు త్యాగరాజన్ సొంత బ్యానర్ స్టార్ మూవీస్‌లో రీమేక్ చేశారు. ఆయుష్మాన్ ఖురానా పోషించిన పాత్రను ప్రశాంత్ పోషించారు. హీరోయిన్‌గా ప్రియా ఆనంద్ నటించగా ఇతర పాత్రల్లో సిమ్రాన్, కార్తీక్, యోగిబాబు, ఊర్వశి, కేఎస్ రవికుమార్, మనోబాల, వనిత, సెమ్మలర్ తదితరులు నటించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు మంచి ఆదరణ లభించిన విషయం తెల్సిందే.

మహా నటుడు శివాజీ గణేశన్ 23వ స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నై నడిగర్ సంఘం ప్రధాన కార్యాలయంలో


ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆ సంఘం కోశాధికారి, హీరో కార్తీ, సీనియర్ నటి సచ్చు, కార్యవర్గ సభ్యులు దళపతి దినేష్, సౌందరరాజన్, వాసుదేవన్, ఆనంద్, ప్రకాష్, వైశాలి దయానా తదితరులు

విజయవంతంగా ముగిసిన జెట్ ఆధ్యాత్మిక పోటీలు

ప్యారీస్, జూలై 21 : జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు (జెట్) చెన్నై విభాగం ఆధ్వర్యంలో త్రిదశ వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆధ్మాతిక పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో నగరానికి చెందిన వివిధ పాఠశాలలకు చెందిన 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన ప్రత్యేక సభలో విజేతలకు నిర్వాహకులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. జెట్- చెన్నైఅధ్యక్షులు రవీంద్రకుమార్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 14న భజనపోటీలు నిర్వహించారు. శని, ఆదివారాలు రామయణంలోని సుందరకాండపై డ్రాయింగ్, క్విజ్ పోటీలు, విష్ణుసహస్రనామ పారాయణం, అష్టకాలు, రామాయణం, నాలాయిర దివ్య ప్రబంధం తదితర అంశాలపై పోటీలు జరిగాయి. ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా చిన్నజీయర్ స్వామికి అష్టోత్తర పూజలు చేసి, రవీంద్రకుమార్ రెడ్డి పాల్గొని చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఎస్‌పీడీ చారిటీస్ ట్రస్టీలు కిషోర్, ఊటుకూరు శరత్‌కుమార్, ఎస్ఎల్ సుదర్శనం, డీఆర్‌సీసీ చారిటీస్ మేనేజింగ్ ట్రస్టీ ముక్కాల కన్నయ్యశెట్టి, పీఆర్సీ చారిటీస్‌కి చెందిన కోటా సుధాకర్, కాకుమాని చారిటీస్ నిర్వాహకులు జెట్ సభ్యులు వీపీఆర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులందుకున్న చిన్నారులతో జెట్ నిర్వాహకులు, ప్రముఖులు

అన్నాసాలైలో జీఎం మాడ్యులర్ సెంటర్

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ వస్తువుల తయారీలో పేరొందిన జీఎం మాడ్యులర్ సంస్థ నగరంలోని అన్నాసాలై ప్రిస్టేజ్ జకారియా మెట్రోపాలిటన్‌లో కొత్త సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సెంటర్‌ను జీఎం సంస్థ బ్రాండ్ అంబాసిడర్, బాలీవుడ్ నటుడు సునీల్‌శెట్టి ప్రారంభించారు. ఈ సెంటర్‌లో కస్టమర్లను ఆకట్టుకునేలా మాడ్యులర్ స్విచ్‌లు, హోమ్ ఆటోమేషన్ సిస్టమ్స్, డెకొరేటివ్ లైట్స్, ఫ్యాన్ తదితర గృహోపయోగ వస్తువులున్నాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జయంత్ జైన్ తెలిపారు.


కొత్త సెంటర్‌ను ప్రారంభించిన బాలీవుడ్ నటుడు సునీల్‌శెట్టి, సంస్థ ఎండీ జయంత్ జైన్

వైభవంగా లక్ష పసుపు కొమ్ముల పూజ



వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ధ్రువ పత్రంతో ఓలేటి రష్మి, లావణ్య, అచ్చా ఆనంద్ తదితరులు - సత్యనారాయణ వ్రతంలో ముత్తయిదువులు

● వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో నమోదు

ప్యారీస్, జూలై 21: గురుపూర్ణిమ సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా వీ-502ఏ ఆధ్వర్యంలో వసుదైక కుటుంబం-త్రివేణి సంగమం పేరుతో ఆదివారం ఆళ్వార్‌పేటలోని ఎతిరాజ్ కల్యాణ మండపంలో విశేష కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు వాసవి మాత పూజతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో లక్ష పసుపు కొమ్ముల పూజ, సత్యనారాయణ వ్రతం, వైశ్య వ్యాపార్-2024 కార్యక్రమాలు జిల్లా గవర్నర్ ఓలేటి రష్మి సునీల్, క్యాబినెట్ సెక్రటరీ ఎం.లావణ్య, క్యాబినెట్ ట్రెజరర్ అచ్చా ఆనంద్ పర్యవేక్షణలో జరిపించారు. వాసవి క్లబ్‌ల తరఫున తొలిసారిగా ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్విరామంగా సాగిన ఈ కార్యక్రమం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకావడం విశేషం. 40కి పైగా వాసవి క్లబ్‌ల నిర్వాహకులు, సభ్యులు, వైశ్య ప్రముఖులు పాల్గొని పూజలు నిర్వహించారు. పాల్గొన్న 500 మందికి పైగా ముత్తయిదువులకు చీరలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమ, వాసవి అమ్మవారి ఫొటో, ప్రసాదాన్ని నిర్వాహకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ రష్మి మాట్లాడుతూ... వి.502-ఏ జిల్లా నిర్వహణలోని 40కి పైగా వాసవి క్లబ్‌ల నిర్వాహకులు, సభ్యులు, పలువురు దాతల సహకారంతో రాజధాని నగరంలో లోకకల్యాణార్థం తొలిసారిగా నిర్వహించిన త్రివేణి సంగమం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకావడం సంతృప్తికరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

ఆడి పౌర్ణమి దర్శనం కోసం

తిరుచెందూరుకు పోటెత్తిన భక్తజనం


సెంథిల్ ఆండవర్ దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామివారు కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ద్వితీయ క్షేత్రంగా భాసిల్లుతున్న తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయంలో ఆడి పౌర్ణమి సందర్భంగా స్వామివారిని దర్శనానికి వేల సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయం వద్ద, సముద్రతీరంలో రద్దీ ఏర్పడింది. పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ఆడి పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఉదయం నుండే వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తిరుచెందూరు క్షేత్రానికి చేరుకున్నారు. వీరంతా సముద్ర తీరంలో, నాళికినరు (తీర్థబావి) తదితర తీర్థాల్లో పుణ్యస్నానాలు చేసి సెంథిల్ ఆండవర్ స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. సాయంత్రానికల్లా ఆలయం ప్రాంగణమంతా వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. డీఎస్పీ వసంతరాజ్ నాయకత్వంలో పోలీసులు భక్తులను క్రమబద్ధీకరించి స్వామివారి దర్శనం కోసం ఆలయం లోనికి పంపారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ అరుళ్‌మురుగన్, బోర్డు సభ్యులు భక్తులకు సదుపాయాలు కల్పించారు. ఇక శనివారం రాత్రి భక్తులందరూ సముద్రతీరంలోనే భోజనాలు చేసి నిద్రించారు. ఆదివారం ఉదయం నాళికినరు, సముద్రతీరంలో స్నానమాచరించి స్వామివారిని దర్శించారు. భక్తుల రద్దీ కారణంగా స్వామివారిని దర్శించేందుకు ఐదుగంటలపాటు భక్తులు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. ఇక తిరుచెందూరు నగరం వాహనాలతో నిండిపోయింది. తీర్థకొలను వద్ద, డాక్టర్ శివంది ఆదిత్తనార్ మణిమండపం, ఐఎంఏ హాలు, దినసరి మార్కెట్ తదితర ప్రాంతాల్లో పోలీసులు ఆ వాహనాలకు పార్కింగ్ వసతి కల్పించారు.

కోలాహలంగా తిరుచెందూరు సముద్రతీరం



ముడిచ్చూరు వద్ద రూ.42.70 కోట్లతో

ఆమ్నీ బస్సుల పార్కింగ్ పాయింట్

● పరిశీలించిన మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆమ్నీ బస్సుల యజమానుల చిరకాల కోరిక మేరకు ముడిచ్చూరు వద్ద రూ.42.70 కోట్లతో ఆమ్నీ బస్సుల పార్కింగ్ పాయింట్ నిర్మిస్తున్నట్లు సీఎండీఏ చైర్మన్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఆదివారం ఉదయం అధికారులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎండీఏ ఆధ్వర్యంలో అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదెకరాల్లో ఈ పార్కింగ్ పాయింట్ ఆమ్నీ బస్ టెర్మినల్ స్థాయిలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పాయింట్ వద్ద మరుగుదొడ్లు, స్నానాలగదులు, డ్రైవర్లు, క్లీనర్ల కోసం క్యాంటీన్ సదుపాయంతో రెండు భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఒకే సమయంలో వంద మంది బస చేయడానికి వీలుండేలా వీటి నిర్మాణం ఉంటుందన్నారు. ఈ పాయింట్ నుంచి రాత్రి వేళ కిలాంబాక్కం బస్ టెర్మినల్‌కు వెళ్ళి ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరవచ్చునని చెప్పారు. వచ్చే నెలాఖరులోగా ఈ పార్కింగ్ పాయింట్ వినియోగంలోకి వస్తుందని శేఖర్‌బాబు తెలిపారు. పార్కింగ్ పాయింట్ స్థలపరిశీలించిన అనంతరం మంత్రి, అధికారులతో బయలుదేరి చెన్నై మీంజూరు రింగ్‌రోడ్డులో వ్యాయామ ఉద్యానవనాలు నిర్మించనున్న నాలుగు ప్రాంతాలను కూడా పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉద్యానవనాల్లో ఓపెన్ ఎయిర్ థియేటర్లు కూడా నిర్మించి, వ్యాయామానికి అవసరమైన పరికరాలను సమకూర్చనున్నామని చెప్పారు. మీంజూరు, వెళ్ళనూరు, తినుగేశ్వరం, వరదరాజపురం ప్రాంతాల్లో ఈ ఉద్యానవనాల పనులు జరుగుతాయని వివరించారు. మంత్రితో పాటు రాష్ట్ర గృహవసతి నగరశివారు ప్రాంతాల అభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి కాకర్ల ఉష, సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్షుల్ మిశ్రా, మాధవరం ఎమ్మెల్యే ఎస్.సుందర్శనం, గుమ్మిడిపూండి ఎమ్మెల్యే డీజే గోవిందరాజన్, పొన్నేరి ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్, మీంజూరు టవున్ పంచాయతీ అధ్యక్షురాలు రుక్మిణి, ఉపాధ్యక్షులు పి. అలెగ్జాండర్ తదితరులు పర్యటించారు.


ఫిట్‌నెస్ పార్కులు నిర్మించే ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు


ముడిచ్చూరు వద్ద ఆమ్నీ బస్సుల పార్కింగ్ పాయింట్‌ను పరిశీలించి వస్తున్న మంత్రి




నూతన విద్యార్థి మండలి సభ్యులతో అతిథులు, నిర్వాహకులు - మండలి సభ్యులకు బ్యాడ్జ్ అందిస్తున్న ప్రిన్సిపాల్ సుమ, ఎస్ఐ రాజ్ ప్రభు

లక్ష్యసాధనకు క్రమశిక్షణే ముఖ్యం

● రామాపురం ఎస్ఐ రాజ్‌ప్రభు

పెరంబూర్, జూలై 21: క్రమశిక్షణతో తాము ఎంచుకున్న లక్ష్యాలు చేరుకోవచ్చని రామాపురం ఎస్ఐ రాజ్‌ప్రభు విద్యార్థులకు సూచించారు. రామాపురంలోని నారాయణ పాఠశాలలో శనివారం 'నూతన విద్యార్థి మండలి' ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. పాఠశాల డీజీఎం డా.లక్ష్మి సంయుక్త సూచనలతో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమ, జోనల్ కో-ఆర్డినేటర్ శేషిరెడ్డి, అకడమిక్ డీన్ వాణి, వైస్ ప్రిన్సిపాల్ షకీల్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామాపురం ఎస్ఐ రాజ్ ప్రభు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైనదని, ఎంచుకున్న లక్ష్యాల సాధన విద్యార్థి దశ నుంచే ప్రారంభమతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థి నాయకులు అందజేసిన గౌరవ వందనాన్ని ముఖ్యఅతిథి స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంగీత కచ్చేరి విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు


వేడుకల్లో నిర్వాహకులు

పెరంబూర్, జూలై 21: స్థానిక పాత చాకలిపేటలో గురుపూర్ణిమ వేడుకలు వైభవంగా జరిగాయి. ట్యాంక్ స్ట్రీట్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో జరిగిన వేడుకలు ఆలయ పూజారి మాధవయ్య నేతృత్వంలో జరిగాయి. ఉదయం సాయిబాబాకు అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తండయార్‌పేట కలరా ఆసుపత్రి ప్రాంగణంలోని మెంటల్ రిహాబిలిటేషన్ ఉన్న వారికి అన్నదానం చేశారు.